## క్లుప్తంగా

### నేటి నుంచి పది పరీక్షలు

ధారూరు: ధారూరు మండలంలోని కేరెళ్లి, ధారూరు ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బాబుసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మోమిన్‌కలాన్, నాగారం, తరిగోపుల, కేరెళ్లి, కుక్కింద, ధారూరు(బాలుర), ధారూరు( బాలికల), నాగసముందర్ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 313 మంది, కేరెళ్లి సెంటర్‌లో 141, ధారూరు సెంటర్‌లో 172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు.

### ప్రజలే బుద్ధిచెబుతారు

బీఆర్ఎస్ నేత మేగ్యానాయక్



కుల్కచర్ల: తమ అవసరాలకై పార్టీలు మారే వ్యక్తులకు ప్రజలే తగిన సమయంలో బుద్ధిచెప్తారని చౌడాపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మేగ్యానాయక్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగత ప్రయోజనాలకై పార్టీలు మారే నేతలకు రానున్న ఎన్నికల్లో బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వెళ్లే నాయకులను ప్రజలు ఓడించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలన్నారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రం వద్ద కోతుల బెడద



కరన్‌కోట్ పాఠశాల పైన కోతులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కువగా చెట్లు ఉన్నాయి. ఈ క్రమంలో గత కొన్నిరోజుల నుంచి ప్రతి రోజు పాఠశాల ఆవరణలో కోతులు వస్తున్నాయి. చెట్లపై కోతులు పెద్ద ఎత్తున ఉండటంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోకి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. తాజాగా పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకముందే కోతుల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

### ఇఫ్తార్ విందులో శుభప్రద్ పటేల్



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం ఇమ్రాన్ జిమ్‌లో ఇచ్చిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు కర్జూరా ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంజాన్ అంటే నియమాలకు మారు పేరన్నారు. ఎంతో నిష్ఠతో దీక్ష చేస్తూ నెలరోజుల పాటు భక్తిభావంతో ఉంటారన్నారు. ఈ దీక్షలో నిర్వాహకులు ఇమ్రాన్, రియాజ్, అమీర్, సుజీత్ మఠంలా, పద్మాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో సమావేశం నిర్వహించి గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భీంభరత్‌తో పాటు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీలో అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా గుజరయ్య, శంకరయ్య, కార్యదర్శిగా జి.రామచంద్రి, కోశాధికారిగా మహేందర్, సలహాదారులుగా సత్యనారాయణ, నర్సింలు, మంగలి రాములు, జంగయ్య, లింగం, యాదయ్య, నర్సింలు, చంద్రయ్య తదితరులు ఉన్నారు. పార్టీ కోసం పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. నాయకులు మధుసూదన్‌గుప్తా, నర్సింలు, టేకుపల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి, గ్రామ యూత్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో సమస్యల తిష్ట

- నిండిన మురుగుకాల్వలు, వెలగని వీధి దీపాలు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పత్తాలేని ప్రత్యేకాధికారులు



మురుగు కాల్వలో చెత్తను చూపిస్తున్న గ్రామస్తుడు

పెద్దేముల్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఏ గ్రామానికి ఏ ప్రత్యేకాధికారిని నియమించారో తెలియటం లేదని ప్రజలు మండి పడుతున్నారు. గ్రామాల్లో మురుగు కాల్వలు నిండి, వీధిలైట్లు వెలగక, మిషన్ భగీరథ నీరు అందక, దోమలబారిన పడి రోగాల బారిన పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పెద్దేముల్, అడ్కిచెర్ల, మంబాపూర్, హన్మాపూర్, ఓంలానాయక్ తండా, ఉరేంటితండాతో పాటు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో టైఫాడ్, మలేరియా కేసులు ఎక్కువైపోయాయని ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతన్నాయని స్థానికులు వాపోతున్నారు. అడ్కిచెర్లలో తాగునీటి బోరులు పాడై మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలపినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**వెలుగని వీధి దీపాలు..**

మంబాపూర్‌లోని ప్రధాన వీధుల్లో వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఓంలానాయక్ తండా పంచాయతీ కార్యదర్శి ఎవరు... వారు ఎన్ని రోజులకు ఓసారి వస్తారు.. మా గ్రామ సమస్యలు ఎవరికి చెప్పాలని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయం మండల అధికారులకు తెలసినా పట్టించుకోవడం లేదని తండావాసులు వాపోతున్నారు. వెంటనే ఆయన స్థానంలో ఇతరులను కేటాయించాలని పలువురు కోరుతున్నారు. దానికి తోడు పలు గ్రామాలల్లో మురుగు రోడ్ల పై ప్రహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# కోడ్ నియమాలు పాటించాలి



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌చంద్ర

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీవాస్‌చంద్ర

పరిగి: ఎన్నికల కోడ్ నియమాలను రాజకీయ పార్టీల నాయకులు పాటించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీవాస్‌చంద్ర సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని నాయకుడిని ఎన్నుకుని చట్టసభలో పంపించేది ఓటర్లే అన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా, నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు ఆయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి కృషి



హనుమాన్ ఆలయాన్ని పరిశీలిస్తున్న మారుతి కిరణ్

దోమ: దేవాలయ అభ్యున్నతికి తనవంతు సహాయం అందిస్తానని బీజేపీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి కిరణ్ అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని మైలారంలో హనుమాన్ దేవాలయానికి ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆలయాల పునర్నిర్మాణం, హైందవ ధర్మ పరిరక్షణకు తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, మండల అధ్యక్షుడు అనంతయ్య, మాజీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, నాయకులు గోవర్ధన్, మొగులయ్య, నర్సింహులు, బీరప్ప, వెంకటేశ్, రాంచందర్, దాసు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా రహదారి



కోట్‌పల్లికి వెళ్లే రోడ్డులో తీసేసిన సైడ్‌బర్మ్స్

ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వెళ్లే దారి నుంచి బూర్గుగడ్డకు వెళ్లే 1.6 కిలోమీటర్ల సింగిల్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన అధికారులు.. కాంట్రాక్టర్‌తో రోడ్డు పక్కన ఉన్న మట్టిని జేసీబీతో తీసివేస్తున్నారు. దీంతో సమతలంగా ఉన్న రోడ్డు కాస్తా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. సైడ్ బర్మ్స్‌కు మట్టిని వేరేచోటు నుంచి తీసుకవచ్చి వేయాల్సి ఉన్నా రోడ్డు పక్కన మట్టిని వేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధారూరు నుంచి బంట్వారం వయా నాగసముందర్ మీదుగా సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చినప్పటికీ మధ్యాలోని 1.6 కిలోమీటర్ల రోడ్డును అలాగే వదిలేశారు. ఈ రోడ్డును ఎందుకు అసంపూర్తిగా వదిలేశారో అని రుద్రారం, నాగసముందర్ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సింగిల్ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం




బంట్వారంలోని పదోతరగతి పరీక్షా కేంద్రం

బంట్వారం: నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బంట్వారం మండలంలో 4 జెడ్పీహెచ్ఎస్, 3 కేజీబీవీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 218 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలికలు 128 కాగా, బాలురు 90 మంది ఉన్నారు. ఇందుకు సంబంధించి మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే బంట్వారం రెసిడెన్షియల్ పాఠశాల తోల్‌కట్టలో కొనసాగుతుంది. ఇక్కడ చదివే 82 మంది పదో తరగతి బాలికలు వికారాబాద్‌లో పరీక్ష రాయనున్నారు. అదేవిధంగా కోట్‌పల్లి మండలంలో ఐదు జెడ్పీహెచ్ఎస్, ఒకటి కేజీబీవీ పాఠశాల ఉంది. వీటిలో 174 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 96 మంది బాలికలు, 78 మంది బాలురు ఉన్నారు. ఇందుకు సంబంధించి కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ చంద్రప్ప తెలిపారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని మూడు పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు ముగ్గురు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు ముగ్గురు, ఇన్విజిలేటర్లు 26 మంది పరీక్షల విధుల్లో ఉంటారని ఎంఈఓ చంద్రప్ప చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పరీక్షా సమయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు అర గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎగ్జాం సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంఈఓ తెలిపారు.

**కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో..**

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో పదవ తరగతి పరీక్షలను అన్ని ఏర్పాట్లు చేశామని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ తెలిపారు.ఉమ్మడి కుల్కచర్ల మండల పరిధిలో కుల్కచర్ల బాలుర, కుల్కచర్ల బాలికల జెడ్పీ పాఠశాలలు, పుట్టపహాడ్ జెడ్పీ పాఠశాల, ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల, చౌడాపూర్ జెడ్పీ పాఠశాల, మరికల్ జెడ్పీ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. మొత్తంగా 1058మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు రావాలని ఎదైనా కారణం చేత ఆలస్యమైతే ఐదు నిమిషాల వరకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

**మర్పల్లి మండలంలో..**

మర్పల్లి: నేటి నుంచి నిర్వహించే 10వ తరగతి పరీక్షల కోసం సర్వం సిద్ధం చేశామని మండల విద్యాధికారి విద్యాసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మర్పల్లి ఆదర్శ పాఠశాల, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన అన్నారు. మండలంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలోని పట్లూర్ పరీక్ష కేంద్రంలో 139 మంది విద్యార్థులు, మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 134 మంది విద్యార్థులు, మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాలలో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా సమయం కంటే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. మండల పరిధిలోని ఆయా వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు సంబంధిత వార్డెన్లే రవాణా సౌకర్యం కల్పించారని ఆయన వివరించారు.

### నేడు సర్వసభ్య సమావేశం

దోమ: దోమ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ మహేశ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనసూయ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

### శోభాయమానంగా శకటోత్సవం

కుల్కచర్ల: మండల పరిధి బండవెల్కిచర్లలోని శ్రీ రుక్మిణీపాండురంగ స్వామివారి ఆలయ వారోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శకటోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు తమ వాహనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గేటు వద్ద ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన దివంగత వై.బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు ప్రభాకర్ రెడ్డి 'వాసుదేవ చలివేంద్రాన్ని' వీరయ్య స్వామి చేతులమీదుగా ప్రారంభించారు. వేసవికాలం నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రయోగాల గురించి వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: చదువుల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో ఉన్న ఎస్‌వీఆర్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్)ను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు రకాల ఉపకరణాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బట్టీ పద్ధతిలో కాకుండా దృశ్య వీక్షణ, ప్రయోగాలతో కూడిన బోధన ద్వారా విద్యార్థుల్లో పాఠ్యాంశాల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. తద్వారా వారు తమకు ఆసక్తి ఉన్న చదువులపై మరింత మక్కువ పెంచుకొని తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై వారికి అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో కొత్త కొత్త ఆవిష్కరణలు చేసేందుకు బీజం పడుతుందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సురేందర్, నవీన్‌చారి, పాఠశాల యాజమాన్యం వీరమోని దేవేందర్‌ముదిరాజ్, విన్సంట్‌రెడ్డి, ఉపాధ్యాయులు భవానీ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలతో స్నేహభావం**

క్రీడలు ఆయా ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువత భవిష్యత్‌లో సులువుగా పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో ఉపాధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో చక్కగా రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు, మల్లన్న నామస్మరణతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్దకు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గౌరీసతీశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, శకుంతల పాండు, సునితారామస్వామి ఉన్నారు.

# ట్రా'ఫికర్'

- చేవెళ్లలో కనిపించని సిగ్నల్ వ్యవస్థ
- రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు
- పరిష్కరించాలని వేడుకోలు



చేవెళ్లలోని ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌లో వాహనాలు

చేవెళ్ల: రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల సంఖ్యతో చేవెళ్ల మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై వాహనాల రద్దీతో మండల కేంద్రంలో ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నా వాహనదారుల సమస్యలు పరిష్కారం కాకపోవటంతో మండల ప్రజలు ట్రాఫిక్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో ఏ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థ లేదు. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదుకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అవుతుంటే క్లియర్ చేయాల్సిన బాధ్యత ఎవరిపై ఉందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. చలాన్లు వేయటమే కాదు ట్రాఫిక్ క్లియర్ కూడా చేయాలని కోరుతున్నారు.

**కనిపించని ట్రాఫిక్ సిగ్నల్స్..**

మండల కేంద్రం మీదుగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి కలిసి ఉండడంతో ఈ రోడ్డుపై నిత్యం వాహనాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఈ రోడ్డుపై వికారాబాద్, పరిగి, తాండూర్, కొండగల్, కర్ణాటక రాష్ట్రానికి హైదరాబాద్‌కు లింకుగా ఉంది. దీంతో పాటు ఈ రోడ్డుపై ఉన్న మండలాలు, గ్రామాల ప్రజల వాహనాలు కూడా మండల కేంద్రం పైనుంచే వెళ్తుండటంతో నిత్యం ఈ రోడ్డు బీజీగా మారుతోంది. లోకల్ వాహనాలు కూడా తోడవటంతో ఈ ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. మండల కేంద్రంలో దుకాణాలు వద్ద వాహనాలు నిలపడం, చౌరస్తాలలో వాహనాలు అటు ఇటుగా పోతుండడంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉంది కానీ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేదు. గతంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ మరిచారు. సిగ్నల్ కోసం సామగ్రి సైతం వచ్చినా వాటిని ఒకటి రెండు చోట్లు ఏర్పాటు చేశారు. అవి కూడా ఎక్కడా లేవు. మిగతా చోట్ల ఎక్కడ కూడా వాటిని ఏర్పాటు చేయలేదు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సివిల్ పోలీస్ స్టేషన్ రెండు పక్కపక్కనే ఉన్నాయి. ఈ పోలీస్‌స్టేషన్‌ల ముందే ఆర్టీసీ బస్‌స్టేషన్ చౌరస్తా ఉండడంతో నిత్యం ఇక్కడే వాహనాల జామ్ అవుతూనే ఉన్నాయి. పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న చిన్న అవసరాలకు దుకాణాలకు ద్విచక్ర వాహనాలపై వచ్చి వెళ్తుంటారని వారికి చలాన్లు వేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు వేయటానికే పరిమితం కాకుండా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని లేదంటే మండల కేంద్రంలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చేవెళ్ల రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

### సమస్య పరిష్కరించాలి



ట్రాఫిక్ పోలీసుల పనితీరు ప్రభుత్వం మార్చి వేసినట్లుగా వీరు మారిపోయారు. కేవలం వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు చలాన్లు వేయటమే పనిగా పెట్టుకున్నారు. ప్రతిరోజు వాహనాలకు చలాన్ల కోసం ఫొటోలు తీయటం తప్పా ఏమి చేయటం లేదు. చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా క్లియర్ చేయటం లేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఫొటోలు మండల కేంద్రానికి దూరంగా తీస్తే బాగుంటుంది. అధికారులు ఆలోచన చేసి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలి.

– రవీందర్, వాహనదారుడు, మల్కాపూర్

### సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి. ప్రధాన చౌరస్తాలలో ఉన్న రద్దీని గుర్తించి దానికి తగిన విధంగా ట్రాఫిక్ అంశాలు పెట్టాలి. చేవెళ్ల బస్‌స్టేషన్ వద్ద నుంచి బస్సులు వెళ్లే చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యలు ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చలాన్లపైనే కాకుండా ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాలి.

– హరిలాల్, వాహనదారుడు, చేవెళ్ల